లంగర్‌హౌస్‌లో ఫ్లాగ్‌మార్చ్

అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడానికి పకడ్బందీ ఏర్పాట్లు చేపడుతున్నామని దక్షిణ, పశ్చిమ మండలం డీసీపీ బాలస్వామి అన్నారు. శనివారం సాయంత్రం లంగర్‌హౌస్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. కార్యక్రమంలో డీసీపీ బాలస్వామి, అదనపు డీసీపీ అశ్వాక్ అహ్మద్, గోల్కొండ ఏసీపీ సయ్యద్ ఫయాజ్, ఇన్‌స్పెక్టర్ నిరంజన్ రావు, పోలీస్ సిబ్బంది, అదనపు బలగాలతో కలిసి పాల్గొన్నారు.

- మెహిదీపట్నం, నవంబర్ 4

రచయితలు ప్రేరణ పొందాలి

యువ రచయిత్రుల సమ్మేళనంలో పాల్గొన్న వక్తలు

తెలుగు యూనివర్సిటీ, నవంబర్ 4 : ప్రపంచ సాహిత్యంలోని రచయితల రచనలను అధ్యయనం చేస్తూ యువ రచయితలు ప్రేరణ పొందాలని భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ సూచించారు. తెలంగాణ సారస్వత పరిషత్తు సాహిత్యానికి యువ తరానికి అందించాలనన్న సంకల్పంతో యువ రచయిత్రుల సమ్మేళనం ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన మామిడి హరికృష్ణ కవిత్వం, కథ అంశంపై రచయితల రచనలపై స్ఫూర్తిని కలిగించారు. పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి మాట్లాడుతూ.. సమాజంలోని అంశాల ఆధారంగా సజీవమైన రచనలు సృశించవచ్చని అన్నారు. తెలంగాణ సాహిత్యానికి భవిష్యత్తు ఉందని ప్రముఖ రచయితలు డాక్టర్ ముదిగంటి సుజాతారెడ్డి, డాక్టర్ చింతపల్లి వసుంధరారెడ్డి, పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె. చెన్నయ్య వివరించారు. కార్యక్రమంలో సి. ఉమాదేవి, జి. శ్యామల, వి నాగలక్ష్మి, ఎ. శ్రీలక్ష్మి, సీహెచ్ పింగళి, డాక్టర్ యాకూబ్, డాక్టర్ కె. కోటేశ్వరరావు, డాక్టర్ కె. నరేశ్‌రావు యువ రచయితలకు పలు సూచనలు చేశారు. ఆదివారం సమ్మేళనం జరుగనున్నది.

ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పాదయాత్ర

ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడుతున్న ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, నాంపల్లి ఎంఐఎం ఎమ్మెల్యే అభ్యర్థి మహ్మద్ మాజిద్ హుస్సేన్

మెహిదీపట్నం, నవంబర్ 4 : ప్రతి సమస్యను పరిష్కరించి అభివృద్ధిని అందిస్తున్నామని ఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. శనివారం నాంపల్లి నియోజకవర్గం అహ్మద్‌నగర్ డివిజన్‌లో ఎంఐఎం ఎమ్మెల్యే అభ్యర్థి మహ్మద్ మాజిద్ హుస్సేన్‌తో కలిసి ఎంపీ పాదయాత్ర నిర్వహించారు. ప్రజలతో మాట్లాడి అసెంబ్లీ ఎన్నికల్లో మాజిద్ హుస్సేన్‌ను గెలిపించాలని కోరారు. పాదయాత్రలో ఎంఐఎం నాయకులు జాఫర్ ఖాన్, డాక్టర్ షేక్ ఖాసీం, మూసా, ఆరిఫ్ రిజ్వాన్, సర్పరాజ్ సిద్ధిఖీ, ఖాజా మొహినుద్దీన్, సయ్యద్ అహ్మద్ రజ్వీమాజీద్, నాసర్, ఫిర్దోస్ పాల్గొన్నారు.

నాంపల్లిలో ఒక నామినేషన్ దాఖలు

అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల పర్వంలో రెండో రోజు శనివారం నాంపల్లి నియోజకవర్గంలో ఒక్క నామినేషన్ దాఖలు అయ్యింది. బీఆర్ఎస్ తరపున పార్టీ సీనియర్ నాయకులు హింగోలికార్ సంతోష్‌కుమార్ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి లావణ్యకు అందించారు. ఈ సందర్భంగా ఆర్ఓ లావణ్య మాట్లాడుతూ.. రెండు రోజుల్లో కేవలం ఒక్క నామినేషన్ మాత్రమే దాఖలు అయ్యిందని చెప్పారు. **- మెహిదీపట్నం, నవంబర్ 4**

కంచన్‌బాగ్ మిశ్రా ధాతు నిగమ్ లిమిటెడ్ (మిధాని)లో కేంద్ర రక్షణ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో మనీరత్న పబ్లిక్ సెక్టార్ అండర్ టేకింగ్‌లో సీవీసీ సూచనల మేరకు వారం రోజులపాటు 'అవినీతికి నో చెప్పండి.. దేశానికి కట్టుబడి ఉండండి' నినాదంతో విజిలెన్స్ అవేర్నెస్-2023 వారోత్సవాలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా మిధాని చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంజయ్ కుమార్ ఝా హాజరయ్యారు. కార్యక్రమంలో ఫైనాన్స్ డైరెక్టర్ ఎన్. గౌరీ శంకరరావు, ప్రొడక్షన్, మార్కెటింగ్ డైరెక్టర్ టి. ముత్తుకుమార్, డాక్టర్ ఉపేందర్ వెన్నం పాల్గొన్నారు. **- సైదాబాద్, నవంబర్ 4**

ట్యాంక్‌బండ్ విగ్రహాల ప్రశస్తి పుస్తకం ఆవిష్కరణ

హైదరాబాద్ నడిబొడ్డున ట్యాంక్ బండ్‌పై తెలుగు జాతి అభ్యుదయానికి కృషి చేసిన 33మంది మహనీయుల ప్రశస్తిని భావితరాలకు తెలియజేయాలనే సంకల్పంతో ప్రముఖ రచయితలు డాక్టర్ సుందరరావు, డాక్టర్ యన్.సుధాకర్‌నాయుడు, డాక్టర్ యం.వి శాస్త్రి అక్షరార్చన చేశారు. ట్యాంక్‌బండ్ విగ్రహాల ప్రశస్తి పుస్తకాన్ని అమెరికాలోని డల్లాస్ నగరం లెవీస్‌వెల్లీలో తెలుగు గ్రంథాలయం ప్రారంభోత్సవం సందర్భంగా శనివారం సినీ గాయకులు యస్.పి చరణ్, యస్.పి శైలజ, భాషాభిమానులు ఎం.ఆనంద్, టి ప్రసాద్ ఆవిష్కరించారు.

- తెలుగు యూనివర్సిటీ, నవంబర్ 4

పాతనగర అభివృద్ధియే లక్ష్యం

పాతనగర అభివృద్ధియే లక్ష్యమని చాంద్రాయణగుట్ట మజ్లిస్ ఎమ్మెల్యే అభ్యర్థి అక్బరుద్దీన్ ఒవైసీ అన్నారు. శనివారం ఉప్పుగూడ డివిజన్ బస్తీలో మాజీ కార్పొరేటర్ సమద్ బిన్ అబ్బాద్, ఉప్పుగూడ కార్పొరేటర్ ఫహద్ బిన్ అబ్బాద్, మజ్లిస్ నాయకులతో కలిసి అక్బరుద్దీన్ ఒవైసీ సుడిగాలి పర్యటన చేశారు. సాయిబాబానగర్‌లో ఇంటింటికి వెళ్లి గాలిపటం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. స్థానిక నాయకులు సతీశ్ కుమార్, నాగరాజు, సాప కృష్ణ అక్బరుద్దీన్‌కు స్వాగతం పలికారు. సాలార్ ఏ మిల్లాత్ ఎడ్యుకేషన్ ట్రస్టు ద్వారా వేలాది మంది విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు.

- చాంద్రాయణగుట్ట, నవంబర్ 4

హనుమాన్ చాలీసా పారాయణం

జియాగూడ శ్రీసద్గురు సమర్థ నారాయణ ఆశ్రమంలో మఠం పీఠాధిపతి ప్రభు మహరాజ్ నేతృత్వంలో శనివారం సాముహిక హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పుష్పగిరి శంకరాచార్య మమహాసంస్థానం విద్యాశంకర భారతి స్వామి పాల్గొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై చాలీసా పారాయణం చేశారు.

- జియాగూడ, నవంబర్ 4

రాష్ట్ర విద్యా సాఫల్య సర్వే సందర్భంగా..

తెలంగాణ రాష్ట్ర విద్యాసాఫల్య సర్వే - 2023లో గోల్కొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినులు ఫీల్డ్ ఇన్ ఇన్వెస్టిగేషన్ కౌన్సెలర్స్‌గా పాల్గొన్నారని శనివారం కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సుచేత తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కపిలవాయి శ్రీనివాసరాజు మాట్లాడుతూ.. కళాశాలలో స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వే వారు ఇచ్చిన శిక్షణ తీసుకుని టోలిచౌకి, గోల్కొండ , లంగర్‌హౌస్ ప్రాంతాల్లో ఉన్న పాఠశాలల్లో సందర్శించి 3,6,9 తరగతుల విద్యార్థులకు అవగాహన కల్పించారని తెలిపారు. - మెహిదీపట్నం, నవంబర్ 4

కార్వాన్‌లో.. కౌసర్ మొహినుద్దీన్

కార్వాన్ నియోజకవర్గంలో కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామని, అంతేకాకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు అందించామని కార్వాన్ ఎంఐఎం ఎమ్మెల్యే అభ్యర్థి కౌసర్ మొహినుద్దీన్ అన్నారు. శనివారం టోలిచౌకి, నానల్‌నగర్ డివిజన్లలో కార్పొరేటర్ ఎండీ.నసీరుద్దీన్‌తో కలిసి కౌసర్ మొహినుద్దీన్ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా తాము పనిచేశామని చెప్పారు. ప్రజలు మరోసారి తనను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు.

- మెహిదీపట్నం, నవంబర్ 4